క్లుప్తంగా

15 రోజులకోసారి ట్యాంక్‌లు శుభ్రం



వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

విజయనగరం: పట్టణంలో జరుగుతున్న నీటి పంపిణీ విధానంపై అప్రమత్తంగా ఉండాలని ఇంజినీరింగ్ సిబ్బంది, ఎమినిటీస్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ప్రతి 15 రోజులకోసారి ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. ఈ మేరకు జరుగుతున్న ట్యాంక్‌ల పరిశుభ్రతను సోమవారం ఆయన పరిశీలించారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



బదిలీ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు కిరణ్, తదితరులు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సిబ్బందిని సహచర ఉద్యోగులు సోమవారం సత్కరించారు. సెక్రటరీ ఎల్. శారదాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిత, సర్వేయర్ ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రేవంత్, డిజిటల్ అసిస్టెంట్ క్రాంతిలకు బదిలీ జరిగింది. సత్కార కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గణేష్, ముసుగులో నిందితుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న వరుస చోరీలపై ఈ నెల 18న 'వరుస చోరీలతో బెంబేలు' అనే శీర్షికతో సాక్షి కథనాన్ని ప్రచురించింది. దీంతో పోలీస్ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఎస్సై బి.గణేష్ ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించారు. వెంటనే ఆలయానికి వెళ్లి సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం ఇజ్జాడపాలెం గ్రామానికి చెందిన గౌరీప్రసాద్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు వెండి కిరీటాలు, హుండీ నుంచి దొంగలించిన రూ.2,500 నగదును రికవరీ చేసినట్లు చెప్పారు.

కార్పస్ ఫండ్ చెక్కు అందజేత



పార్వతమ్మకు అడిషనల్ కార్పస్‌ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తూ, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆర్‌ఏ వలస పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.నారాయణరావు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్‌ను ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో సోమవారం అందజేశారు. నారాయణరావు ఆగస్టు 30న అనారోగ్య కారణంతో మృతి చెందడంతో ఆయన భార్య పార్వతమ్మకు లక్ష రూపాయల చెక్ అందించారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రభాకరరావు, వెంకటలక్ష్మి, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయ ఆవరణ వద్ద నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. చదురుగుడి ఆవరణలో ఇష్టకామేశ్వరి శాస్త్రీయ నృత్య కళావేదిక టి.సౌమ్య బృందం చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. మాడెం గురునాథరావు, రెడ్డి భాస్కరరావుల ఏకపాత్రాభినయా.. అలాగే వనంగుడి ఆవరణలో యడ్ల తవుడు బృందం కోలాటం, కరణం శృతి భక్తి గీతాలాపన.. సీహెచ్.ప్రసాద్ అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి.

జాతీయ రహదారిపై ప్రమాదాలకు చెక్..

- 12 చోట్ల ఫ్లై ఓవర్ల నిర్మాణం
- ప్రమాదాలు తగ్గుముఖం

పూసపాటిరేగ:

జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ వెళ్తున్న జాతీయ రహదారిలో ముఖ్య కూడళ్ల వద్ద ఫ్లై ఓవర్లు నిర్మించడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. రహదారి సమీపంలో గ్రామాలున్న చోట గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా.. మరికొంతమంది క్షతగాత్రులుగా మిగిలారు. అయితే ఫ్లై ఓవర్లు పూర్తి కావడంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు పైనుంచి రాకపోకలు సాగిస్తుండడంతో అటు ట్రాఫిక్ సమస్య.. ఇటు ప్రమాదాలు తగ్గాయి.

పూసపాటిరేగ, కోనాడ జంక్షన్, సీహెచ్ అగ్రహారం, మైలాన్ జంక్షన్, కనిమెట్ట జంక్షన్, కందివలసగెడ్డ వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. భోగాపురం మండలంలో సుందరపేట జంక్షన్, భోగాపురం, అక్కివరం జంక్షన్, రావాడ జంక్షన్, పోలిపల్లి, రాజాపులోవ జంక్షన్‌లలో ఫ్లై ఓవర్ వంతెనలు ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల పరిధిలో కూడా ప్రమాదాలు బాగా తగ్గాయి. భోగాపురం మండలం రాజాపులోవ జంక్షన్ నుంచి పూసపాటిరేగ మండలం కందివలస గెడ్డ వరకు జాతీయ రహదారి పొడవునా ఏటా ప్రమాదాలు జరిగి 40 నుంచి 50 మంది వరకు మృత్యువాత పడేవారు. ప్రస్తుతం ప్రమాదాల సంఖ్య బాగా తగ్గిందనే చెప్పాలి.



పూసపాటిరేగలో ఫ్లై ఓవర్

తగ్గుముఖం..

ఫ్లై ఓవర్ల నిర్మాణంతో ప్రమాదాలు తగుముఖం పట్టాయి. నిత్యం ఏదో జంక్షన్‌లో ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టాలు జరిగేవి. కొంతమంది క్షతగాత్రులుగా మిగిలేవారు. జాతీయరహదారిపై ముఖ్య కూడళ్లు, గ్రామాలున్న చోట ఫ్లై ఓవర్లు నిర్మించడంతో సులువుగా రాకపోకలు సాగుతున్నాయి.

– కప్పల కృష్ణ,
వాహన చోదకుడు, పూసపాటిరేగ

దేవాంగ సంఘ నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు దుర్గా ప్రసాదరావు

విజయనగరం: నగరంలోని పుత్సలవీధిలో దేవాంగ సంఘ నూతన భవన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ భవనాన్ని తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గా ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాంగ సంఘ జిల్లా అధ్యక్షుడు ఉప్పు ప్రకాశరావు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనరసింహారావు, ఎన్. చిన్నవెంకటరాయుడు, బి. ఆనందప్రసాద్, డాక్టర్ మంచు కుమారస్వామి, డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గజేంద్రుని నిమజ్జనం



ఏనుగు బొమ్మ వస్తువులను చెరువులో నిమజ్జనం చేస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం టౌన్: సిరిమానోత్సవంలో కీలక పాత్ర పోషించిన తెల్ల ఏనుగు చెత్తలెత్తుకునే ట్రాక్టర్‌లో కనపడే సరికి భక్తులు మనోభావాలు దెబ్బతిన్నాయి. దీనిపై 'చెత్త ట్రాక్టర్‌లో ఉత్సవ గజేంద్రుడు' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించా రు. సిరిమాను పూజారి బంటు పల్లి వెంకటరావు దేవదాయశా ఖ తరపున స్పందిస్తూ వెంటనే వైఎస్సార్ నగర్ వద్ద ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. ఇంటిలో ఉన్న సమయంలో బయ ట ఉన్న ఏనుగు బొమ్మను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లో ఎక్కించారని, ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూస్తానని ఆయన చెప్పారు.

రఘుమండలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న విద్యార్థులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 బాల,బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు మండలంలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగాయి. ఈ పోటీలను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, తదితరులు ప్రారంభించారు. 200 మంది బాలురు, 150 మంది బాలికలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, సర్పంచ్ గూడేల విష్ణు, ఎంపీటీసీ సభ్యుడు పిళ్లా ముసలినాయుడు, డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కృష్ణంరాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కె.ప్రభావతి, హెచ్‌ఎం సౌభాగ్యలక్ష్మి, పీడీ కె.భాను, వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న పీఈటీ, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూమి అప్పగించాలి

- జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు

నెల్లిమర్ల: ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమిని తిరిగి వారికి అప్పగించాలని జై భీమ్‌రావు భారత్ పార్టీ నాయకులు టి. నరసయ్య, కె. శ్రీనివాసరావు కోరారు. గుషిణిలో దళితులకు కేటాయించిన భూమిని అప్పగించాలని కోరుతూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుదర్శనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గుషిణి గ్రామంలో సర్వే నంబర్ 266లో ఐదెకరాలను (డీ పట్టా) 38 దళిత కుటుంబాలకు 2010లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే ఆ భూమిలో గ్రామానికి చెందిన కొంతమంది దళితులను బెదిరించి వ్యర్థాలు వేసి పనికిరాకుండా చేయడంతో పాటు మద్యం, ఇసుకబట్టీలు పెట్టి వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. అలాగే మరికొంతమంది దళితుల నుంచి బలవంతంగా కాగితాలు రాయించుకున్నారన్నారు. అధికారులు విచారణ చేపట్టి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, గుణుపూరుపేట గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్లవి ప్రతిభ



విజేతను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయ యూత్ జూనియర్ అండ్ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని ఎస్. పల్లవి పలు పతకాలు సాధించింది. 71 కిలోల కేటగిరీ సీనియర్ విభాగంలో రజత పతకాలు సాధించడంతో సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణరావు మాట్లాడుతూ, క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పల్లవి భవిష్యత్‌లో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్యవేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, లెఫ్టినెంట్ ఉదయ్‌కిరణ్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హెచ్‌హెచ్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• కారు దిగి.. సమస్య తెలుసుకుని..



గుర్ల మండల కేంద్రంలోని డయేరియా బాధితులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం పరామర్శించారు. తిరుగు ప్రయాణంలో వెళ్లిపోతుండగా.. నెల్లిమర్ల మండలం మొయిద వద్ద ఓ దివ్యాంగురాలు వినతిపత్రంతో ఉండడాన్ని గమనించారు. వెంటనే కాన్వాయ్‌ను ఆపించి, బాధితురాలు రమాదేవితో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. పింఛన్ మంజూరుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. – నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

నెల్లిమర్ల: కస్తూరిబా గాంధీ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ బి. ఉమ తెలిపారు. పదో తరగతి విద్యార్థిని బి. లిఖిత రాష్ట్ర స్థాయి అండర్–17 విభాగం త్రోబాల్ పోటీలకు.. వై. హారిక అండర్–19 విభాగం బాస్కెట్ బాల్ పోటీలకు.. ఎస్. భారతి అండర్–17 విభాగం బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండ వెలగాడ విద్యార్థులకు పిలుపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు చైతన్య, గౌతమ్, లోకేష్, లక్ష్మీనారాయణ, లీలా ప్రసాద్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడాలని పిలుపువచ్చింది. వీరిని హెచ్‌ఎం వి.జ్ఞానప్రసాద్ సోమవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది

పోలీస్ అమర వీరులకు నివాళులు..



పీటీసీలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరాజు, తదితరులు

విజయనగరం టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ శిక్షణ కళాశాలలో (పీటీసీ) ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు, తదితరులు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసేవలో తరించే పోలీస్ నుంచి నీతి, నిజాయితీ, అంకితభావం, మానవత్వం, త్యాగం వంటి లక్షణాలను సమాజం ఆశిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు సీహెచ్‌వీ రామారావు, టి.రమేష్, ఏఓ టి.భవానీ, సీఐలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెప్పోత్సవం ట్రయల్ రన్ విజయవంతం



పెద్దచెరువులో తెప్పోత్సవం ట్రయల్ రన్

విజయనగరం టౌన్: సిరిమానోత్సవం పూర్తయిన మరుచటి మంగళవారం (22వ తేదీ) పెద్దచెరువులో నిర్వహించే పైడితల్లి తెప్పోత్సవానికి అధికారులు సోమవారం సాయంత్రం పెద్దచెరువులో ట్రయల్ రన్ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ.. అమ్మవారి తెప్పోత్సవానికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వనంగుడి ఆవరణలో అమ్మవారికి స్నపన కార్యక్రమాలు, వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో అమ్మవారికి వేద స్వస్తి పలుకుతారని చెప్పారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి , సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు చేతుల మీదుగా మూడుసార్లు ప్రదక్షిణలు చేయిస్తారన్నారు. అనంతరం భాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ అమ్మవారిని రథంలో ఉంచి సున్నంబట్టీ వీధి మీదుగా పెద్ద చెరువు వద్దకు తీసుకువస్తామని తెలిపారు. అక్కడ సిద్ధంగా ఉన్న హంస వాహనంపై అమ్మవారిని ఉంచి సాయంత్రం ఐదు గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రామతీర్థం ఆలయ ఈఓ వై.శ్రీనివాసరావు, ఫిషరీస్ డవలప్‌మెంట్ ఆఫీసర్ యు. చాందిని, వన్‌టౌన్ ఎస్సై రామగణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

20 మందికే అనుమతి..

పైడితల్లి తెప్పోత్సవం ట్రయల్ రన్‌ను 40 మందితో నిర్వహించామని ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. అయితే మంగళవారం నిర్వహించే తెప్పోత్సవంలో మాత్రం 20 మందినే అనుమతిస్తామన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఫైర్, పోలీస్, ఫిషరీస్, జాలర్లు పాల్గొంటారన్నారు. రక్షణ నిమిత్తం అదనంగా మరో మూడు బోట్లను హంసవాహనం చుట్టూ ఉండేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



వల్లూరులో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు, మల్యాడ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, కూటమి నాయకులు ఆయా గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గేదెల రాజారావు, సర్పంచ్ పంచాది జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లెంక నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సోయగాల నడుమ రైలు ప్రయాణం..



ఓ వైపు పచ్చని కొండ.. మరో వైపు మనసును ఆహ్లాదపరిచే ప్రకృతి.. ఈ రెండింటి నడుమ రైలు ప్రయాణం.. మనసుకు ఎంతో ఉల్లాసాన్నిచ్చే ఈ దృశ్యం నెల్లిమర్ల నియోజకవర్గం మూల రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం